

ఎప్పటికప్పుడు ధాన్యం కాంటాలు
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తూనే ఎప్పటికప్పుడు కాంటా వేయించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. 8లో



వాలీబాల్ జట్ల ఎంపిక
అండర్ - 14 విభాగంలో వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 22°
వాతావరణం
జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రి మాత్రం చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

18వరకు ఎస్సెస్సీ పరీక్ష ఫీజు గడువు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి విద్యార్థులు వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు ఈనెల 18వ తేదీలోగా ఫీజు చెల్లించాలని డీఈఓ సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 18వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించొచ్చని, రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ.200అపరాధ రుసుముతో డిసెంబర్ 12వరకు, రూ.500అపరాధ రుసుముతో డిసెంబర్ 21వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశముందని తెలిపారు. ఒక్కో సబ్జెక్టు ఫీజు రూ.125 కాగా, గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు సబ్జెక్టుల వరకు రూ.110, ఆపై సబ్జెక్టులకు రూ.125 చొప్పున చెల్లించాలని వెల్లడించారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన గత నెలలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి పదో తరగతి పరీక్షలకు 342మంది హాజరుకాగా 182మంది(53.22శాతం), ఇంటర్ పరీక్షల్లో 380మందికి 216మంది(56.84శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను www. telanganaopenschool.org వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. కాగా, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు కోసం ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు వెబ్‌సైట్ లేదా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ ఒక సబ్జెక్టు రీ కౌంటింగ్‌కు రూ.400, పదో తరగతికైతే రూ.350, ఇంటర్, పదో తరగతి అభ్యర్థులు ఒక్కో సబ్జెక్ట్ రీ వెరిఫికేషన్, జవాబుపత్రం జిరాక్స్ కోసం రూ.1,200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

19న జిల్లాకు బీసీ కమిషన్

ఖమ్మంమయూరిసెంటర్: స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లపై ప్రజల నుండి వినతులు స్వీకరించేందుకు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు ఈనెల 19న ఖమ్మం రానున్నారని బీసీడబ్ల్యూఓ జి.జ్యోతి తెలిపారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని ఆమె వెల్లడించారు. ఆసక్తి కలిగిన పార్టీలు, సంఘాల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలపవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.20 నాన్ జ్యుడిషియల్ స్టాంపు పేపర్‌పై నిర్దేశిత నమూనాలో రాసి ఈనెల 19న ఉదయం 10నుండి సాయంత్రం 4గంటల వరకు ఇవ్వొచ్చని ఆమె తెలిపారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువు మరోమారు పొడిగించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి


మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

ఖమ్మం రూరల్/తిరుమలాయపాలెం: తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ ఓ.సత్యనారాయణరెడ్డి సూచించారు. ఖమ్మం రూరల్ మండలం ఎం.వీ.పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమలాయపాలెంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను సోమవారం తనిఖీ చేసిన ఆయన 9, 10వ తరగతి విద్యార్థులకు భవిష్యత్‌పై దిశానిర్దేశం చేశారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావడమే కాక ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఎప్పటికప్పుడు చదివితే వార్షిక పరీక్షల్లో మంచి గ్రేడ్ సాధించొచ్చని తెలిపారు. ఆతర్వాత గణితంలో అత్యధిక మార్కులు సాధించేలా కొన్ని మెళకువలు నేర్పించారు. ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎంలు జి.శ్రీనివాసరావు, విజయకుమారి, ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్‌రెడ్డి, ఏ.వీ. నాగేశ్వరరావు, హమీద్, ప్రసాద్, నరేందర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొర్రీలు.. రైతుల కష్టాలు



తేమ సాకుతో పత్తి కొనుగోళ్లు అంతంతే..
- తాజా నిబంధనలతో కొనుగోళ్లకు మిల్లర్ల విముఖత
- వాహనాలతో జిన్నింగ్ మిల్లుల వద్ద రైతుల పడిగాపులు
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోనూ అదే పరిస్థితి
- చివరకు మంత్రి తుమ్మల జోక్యంతో దిగొచ్చిన సీసీఐ


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం తీసుకొచ్చిన పత్తి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పెడుతున్న కొర్రీలు అన్నీఇన్ని కావు. తేమ శాతం పేరుతో నామమాత్రంగానే రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తుండడంతో రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద వాహనాలతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరోవైపు కొనుగోలు చేసిన పత్తి బేళ్లు కట్టడంలో పెట్టిన నిబంధనలు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలను అసహనానికి గురి చేశాయి. సీసీఐ నిబంధనలను నిరసిస్తూ మిల్లర్ల అసోసియేషన్ ఇచ్చిన పిలుపుతో సోమవారం సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు నిలిపేశారు. జిల్లాలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటైన జిన్నింగ్ మిల్లుల్లో మధ్యాహ్నం వరకు కొనుగోళ్లు జరగకపోగా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోనూ జెండా పాట రెండు గంటలు ఆలస్యమైంది.

టెండర్ల ఆధారంగా నిబంధనలు

జిన్నింగ్ మిల్లులు సేకరించిన పత్తిని బేళ్లుగా కట్టేందుకు సీసీఐ టెండర్ విధానం అవలంబిస్తోంది. ఒక్కో బేల్ తయారీకి హమాలీ, ప్రెసింగ్, కిరాయి ధరలు కలిపి మిల్లుల యజమానులు రూ.1,590 నుంచి రూ.1,600 వరకు టెండర్ వేశారు. సీసీఐ మాత్రం రూ.1,350గా నిర్ణయించి మిల్లులు దాఖలు చేసిన ధరల ఆధారంగా ఎల్–1(లోయస్ట్ -1), ఎల్–2, ఎల్–3 కేటగిరీలుగా విభజించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. బేళ్లు కట్టేందుకు తక్కువకు టెండర్ వేసిన జిన్నింగ్ మిల్లుల్లోని సీసీఐ కేంద్రంలోనే తొలుత కొనుగోళ్లు చేయాలనే నిబంధన విధించింది. జిల్లాలో తొమ్మిది మిల్లుల్లో కేంద్రాలు ఏర్పాటైతే తక్కువకు కోట్ చేసిన ఒక్క మిల్లులోనే పత్తి కొనుగోళ్లు చేపట్టి, అది నిండాక మరో మిల్లులో కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంటుంది.


కొనుగోళ్లు లేక తల్లాడలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేసిన మిల్లు వద్ద వెలవెలబోతున్న దృశ్యం

మంత్రి తుమ్మల ఆదేశాలతో..

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనడం లేదని తెలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నుంచే హైదరాబాద్‌లోని సీసీఐ ప్రతినిధులతో మాట్లాడారు. మార్కెటింగ్ శాఖ అధికారులకు సైతం ఫోన్‌లో సూచనలు చేశారు. మార్కెటింగ్ శాఖ, సీసీఐ అధికారులు జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరపగా అందరికీ అవకాశం ఇవ్వాలని వారు కోరారు. దీంతో దిగొచ్చిన సీసీఐ అన్ని మిల్లుల్లో కొనుగోలుకు ఆదేశాలు ఇవ్వడంతో మధ్యాహ్నం తర్వాత క్రయవిక్రయాలు మొదలయ్యాయి.

తేమ తకరారు..

మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రాలకు రైతులు పత్తి తీసుకొస్తున్నా ఫలితం ఉండడం లేదు. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే సీసీఐ మద్దతు ధరతో కొనుగోలు చేస్తోంది. దీంతో నిర్దేశిత తేమ శాతం వచ్చేలా రైతులు వాహనాల్లోనే పత్తిని ఆరబెడుతూ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ కారణంగా కొనుగోళ్లుగా నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఈనెల 8వ తేదీ వరకు 915.65 మెట్రిక్ టన్నుల పత్తి మాత్రమే కొనుగోలు చేశారు.

నిరసిస్తూ కొనుగోళ్లు నిలిపివేత

సీసీఐ నిర్ణయంతో ఒక మిల్లు నిండే వరకు మిగతా మిల్లర్లు ఖాళీగా ఉండాల్సి వస్తోందంటూ సోమవారం పత్తి కొనుగోలుకు ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లుల్లో సేకరణ నిలిపేశారు. సమీపంలోని సీసీఐ కేంద్రానికి కాకుండా కొనుగోలు చేసే చోటకు వెళ్లాల్సి రావడంతో రైతులు కూడా ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. ఈ కారణంగా ఖమ్మంలోని సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు జరగకపోగా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 32వేల పత్తి బస్తాలు వచ్చినా గంటన్నర పాటు వేలం మొదలుపెట్టలేదు. ఆ తర్వాత కొనుగోళ్లు ప్రారంభమై సాయంత్రం వరకు కాంటాలు కొనసాగించారు.

పాయింట్ ఎక్కువైనా వెనక్కే...



సీసీఐ కేంద్రానికి పత్తి తీసుకొస్తే తేమ ఎక్కువ ఉందని వెనక్కి పంపిస్తున్నారు. మా దగ్గర తేమ చూసే యంత్రాలు లేవు. అంతా బాగుందని మిల్లుకు తీసుకెళ్తే ఒక పాయింట్ అదనంగా వచ్చినా వెనక్కి పంపిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించాలి.
– నాగండ్ల వెంకటేశ్వర్లు, ఎదుళ్లచెరువు

కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి...



48 బస్తాల పత్తిని మార్కెట్‌కు తీసుకొస్తే క్వింటా రూ.6,400 ధర నిర్ణయించారు. కానీ ఉదయం వస్తే మధ్యాహ్నం 3గంటల తర్వాతే కాంటా వేశారు. జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేయకపోవడంతో ఇక్కడ కూడా వ్యాపారులు ముందుకు రాలేదని తెలిసింది.
– కొండా అశోక్‌చక్రవర్తి, ముష్టికుంట్ల

రూ.66.33 కోట్లతో మంచుకొండ 'లిఫ్ట్'

- సాగర్ నీటితో 30 చెరువులు నింపుతాం
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల తదితరులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: సాగర్ కెనాల్ నుంచి నీరు ఎత్తిపోసేలా మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రూ.66.33 కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసిందని, దీంతో రఘునాథపాలెం మండలంలోని 30 చెరువులను నింపుతామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ధంసలాపురం వద్ద ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారి పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎత్తిపోతల పథకం పనులకు వారంలోగా టెండర్లు పిలుస్తామని, త్వరగా పూర్తి చేసి వచ్చే ఆగస్టు 15 నాటికి మండలంలోని ఆయకట్టుకు నీరు ఇచ్చేలా చెరువులను నింపుతామని వెల్లడించారు. వి.వెంకటాయపాలెం వద్ద ఎత్తిపోతలు ఏర్పాటు చేసి మండలానికి నీళ్లు తీసుకొస్తామని, తద్వారా గిరిజన రైతాంగానికి నీటి వసతి అందుబాటులోకి వస్తుందని మంత్రి చెప్పారు.

ఉగాది నాటికి దేవరపల్లి హైవే

హైదరాబాద్ – విశాఖపట్నం కారిడార్‌లో భాగంగా సూర్యాపేట, ఖమ్మం వరకు హైవే నిర్మాణం పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం – దేవరపల్లి వరకు 165 కి.మీ. మేర గ్రీన్ ఫీల్డ్ హైవేను ఐదు ప్యాకేజీల్లో చేపట్టగా, ఉగాది నాటికి పూర్తిచేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు. నాగ్‌పూర్–అమరావతి, ఖమ్మం–కురవి జాతీయ రహదారి పనులు కూడా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య మ్యాప్ ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లోనూ సత్తా చాటాలి..

- క్రీడాకారులను ప్రోత్సహించేలా 57 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- వైరాలో గురుకులాల జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ జైపాల్ తదితరులు (ఇన్‌సెట్) విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి పొంగులేటి

వైరా: రాబోయే ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు బంగారు పతకాలు సాధించాలని.. ఈ దిశగా శిక్షణ ఇచ్చేందుకు 57 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం గురుకులాల జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ పోటీలను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ గత ఒలింపిక్స్‌లో అత్యధిక పతకాలు సాధించిన దేశాల్లో క్రీడాకారులకు కన్సల్టెన్సీలుగా వ్యవహరించిన నిపుణులను పిలిపించి స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యరంగాలకు పెద్ద పీట వేసిందని.. రూ.657 కోట్ల నిధులతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించినట్లు చెప్పారు. అలాగే, 28 ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఈనెల 14న మరో 60 గురుకులాలకు శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. ఇక విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడమే కాక ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టి కొత్త ఉపాధ్యాయులను నియమించామని మంత్రి వెల్లడించారు. అలాగే, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గురుకులాల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధిస్తూ, పట్టభద్రులు మరింత రాణించేలా శిక్షణ కోసం యంగ్ స్కిల్ ఇండియా యూనివర్సిటీని స్థాపించామని తెలిపారు. ఈసమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, గురుకులాల జోనల్ అధికారి కొప్పుల స్వరూపరాణి, డీసీఓ రాజ్యలక్ష్మి, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ డి.సమత, మీసాల సునీత, చావా జ్యోతి, ఎం.పద్మావతి, పీ.వీ. పద్మావతి, జ్యోతిలిల్లీ, విజయదుర్గ, విజయకుమారి, మైథిలి, ఎం.స్వరూపరాణి, ఐనాల సైదులు, ఉద్యోగులు సంజీవ్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, టి.సాయికుమార్‌తో పాటు నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే...

వైరారూరల్: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం మొదలైన జోనల్ స్థాయి టోర్నీలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 14 గురుకుల పాఠశాలల విద్యార్థులు 1,190 మంది హాజరయ్యారు. తొలిరోజు పోటీల్లో విజేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు. అండర్–17 విభాగం 1,500 మీటర్ల పరుగులో అక్షిల సాయి(ములకలపల్లి), డి.సాగరిక(టేకులపల్లి), పి.కీర్తినందన(వైరా), 800 మీటర్ల పరుగులో బి.హాని(దానవాయిగూడెం), ఎం.హర్షిణి (ఇల్లెందు), డి.సాగరిక(టేకులపల్లి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–19 విభాగం 1,500 మీటర్ల పరుగు పందెంలో ఎస్.భావన(ములకలపల్లి), 800 మీటర్ల పరుగులో వి.లావణ్య(కల్లూరు), యు.తేజస్విని(అంబేద్కర్ జూనియర్ కళాశాల, ఖమ్మం), టి.తేజ(వైరా) మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి


ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


అబుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం ఆయన పలువురి నుంచి వినతిపత్రాలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్ పెట్టొద్దని తెలిపారు. మొదట కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో డీఆర్వో రాజేశ్వరి, డీఆర్డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు కొన్ని..

- వైరా మండలం పాలడుగుకు చెందిన రంగయ్య కుష్టు వ్యాధితో బాధపడుతున్న తనకు గతంలో దివ్యాంగుల పింఛన్ ఇచ్చినా సర్టిఫికెట్ గడువు ముగియడంతో ఆపేశారని తెలిపారు. ఈమేరకు సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు.
- బోనకల్ మండలం పెద్దబీరవల్లికి చెందిన పి.సుమిత్ర సర్వే నంబర్ 575లో ప్రభుత్వం తనకు కేటాయించిన రెండెకరాల అసైన్డ్ భూమిని కబ్జా నుంచి విడిపించాలని వినతిపత్రం అందజేశారు.

నాణ్యత, నమ్మకమే బ్రాండ్

కలెక్టరేట్‌లో ఉన్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. నలుగురు మహిళలు కలిసి క్యాంటీన్ నిర్వహిస్తుండగా వ్యాపారం తీరు, సమస్యలపై ఆరా తీశారు. నాణ్యత పాటిస్తూ, నమ్మకాన్ని చూరగొంటే వ్యాపారం వృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీఆర్డీవో ఎస్.సన్యాసయ్య, అదనపు డీఆర్డీఓ నూరొద్దీన్ తదితరులతో కలిసి కలెక్టర్ టీ తాగారు.

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా చంద్రశేఖరరావు



ఖమ్మం లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా న్యాయమూర్తి చంద్రశేఖరరావు నియమితులయ్యారు. గత ఆరు నెలలుగా సంస్థకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు కొనసాగుతున్నారు. ఈ మేరకు పూర్తిస్థాయి కార్యదర్శిగా నియమితులైన చంద్రశేఖరరావు సోమవరం బాధ్యతలు స్వీకరించారు.

లక్ష గాజులతో అలంకరణ, పూజ


అలంకరణలో ముత్యాలమ్మ తల్లి

తల్లాడ మండలంలోని నారాయణపురంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష గాజులను మాలలుగా కట్టి అర్చకుడు కంచెల సతీష్‌శర్మ ఆధ్వర్యాన అమ్మవారికి అలంకరించడంతో పాటు పంచామృత అభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
– తల్లాడ

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు




బాధ్యతలు స్వీకరించాక సీపీని కలిసిన ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి

ఖమ్మంక్రైం: ఏఆర్ అడిషనల్ డీసీపీగా సీహెచ్.కుమారస్వామి, సీసీఆర్‌బీ ఏసీపీగా పి.రవీందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

రేపు మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. హైదరాబాద్‌లోని కేఎల్ గ్రూప్‌తో పాటు ముత్తూట్ మనీ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఈ మేళా ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 19నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సర్టిఫికెట్ల జిరాక్స్‌తో హాజరుకావాలని, వివరాలకు 77308 20444, 89787 07913 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి మహిళల కబడ్డీ పోటీలు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ మాజీ డైరెక్టర్ దండా నర్సింహారావు తెలిపారు. రానున్న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలు ఈనెల 13 నుంచి 15 వరకు జరుగుతాయని వెల్లడించారు. ఈ పోటీల్లో వరుసగా ఎనిమిది స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలతో పాటు అన్ని జట్లకు ట్రోఫీలు అందజేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: మధిర నియోజకవర్గం చింతకాని మండలం అనంతసాగర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో కణతాల వినోద్‌కుమార్, కణతాల నాగేంద్ర బాబు, షేక్ రఫీ, జానీ, గఫూర్, ఖాసిం, జాన్, రాము, పాగి మనోజ్ తదితరులు చేరగా, నాయకులు బందేల నాగార్జున, నెల్లూరి కోటేశ్వరరావు, శ్యాంసుందరరావు పాల్గొన్నారు.

జమలాపురంలో కార్తీక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామిని కార్తీకమాసం సోమవారం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలను వెలిగించి పూజలు చేశారు. అలాగే, యాగశాలలో 37మంది దంపతులతో అర్చకులు సత్యనారాయణస్వామి వ్రతం చేయించారు. ఆలయ ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఖమ్మంరూరల్: సాగుకు చేసిన అవసరాలకు అప్పులు చేయగా, వరదతో పంట నష్టపోవడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మండలంలోని పోలిశెట్టిగూడెం శివారు ఢాక్యాతండాకు చెందిన రైతు మాలోత్ భద్రాజీ(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... భద్రాజీ తన రెండెకరాల్లో సాగు చేసిన వరి, మిర్చి పంటలు ఇటీవల వచ్చిన వరదతో కొట్టుకుపోయాయి. దీనికి తోడు గతంలో పంట కోసం చేసిన అప్పు రూ.3లక్షలు ఉండడంతో ఎలా తీర్చాలా అనే మనోవేదనతో ఆయన ఈనెల10న పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న భద్రాజీ సోమవారం మృతి చెందాడని సీఐ ముష్కరాజు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,325	4,000
మిర్చి	15,000	6,100
మిర్చి తాలు	7,700	6,000
ఏసీ మిర్చి	17,800	8,000
ఏసీ తాలు	10,000	7,000
పత్తి	6,850	5,700

– ఖమ్మం వ్యవసాయం

ముువ్వన్నెల జెండాలతో విద్యార్థుల ప్రదర్శన



జాతీయ జెండాలతో విద్యార్థినుల ప్రదర్శన

వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆవరణలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని గురుకులాల నాలుగో జోన్ క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముువ్వన్నెల దుస్తులు ధరించిన విద్యార్థినులు జాతీయ జెండాలతో ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే, పాఠశాలల వారీగా విద్యార్థుల నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్యే రాందాస్ గౌరవ వందనం స్వీకరించారు. – వైరా



పరుగు పందెం పోటీని ప్రారంభిస్తున్న అధికారులు



మార్చ్ ఫాస్ట్‌లో విద్యార్థినులు


సాగునీటి ఇక్కట్లు తీరినట్లే..

- రఘునాథపాలెం మండలానికి 'లిఫ్ట్'
- సాగర్ ప్రధాన కాల్వపై రూ.66 కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణం
- మంచుకొండ వద్ద నిర్మాణం.. చెరువులకు నీటి ఎత్తిపోతలు
- ప్రకటించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్: జిల్లాలో మరో ఎత్తిపోతల పథకం మంజూరైంది. వర్షాధారమే తప్ప ఎలాంటి సాగు నీటి వనరులు లేని రఘునాథపాలెం మండలంలోని ఆయకట్టుకు సాగర్ జలాలను అందించేందుకు రూ.66.33 కోట్ల అంచనా వ్యయంతో మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రూపొందించారు. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించగా త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి వచ్చే పంద్రాగస్టు నాటికి మండలంలోని 30 చెరువుల్లోకి నీరు ఎత్తిపోస్తామని తెలిపారు. ఇటీవలే జల వనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది.

నీటి వనరులు లేకపోవడంతో...

రఘునాథపాలెం మండలంలో ఆయకట్టుకు వర్షాధారమే తప్ప ఇతరత్రా సాగు నీటి వనరులు లేవు. సీతారామ ప్రాజెక్టు ద్వారా మండలంలోని ఆయకట్టుకు నీరు అందించాలని నిర్ణయించినా పనుల్లో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. గతంలో బుగ్గవాగు ద్వారా మండలంలోని చెరువులకు లింక్ చేసి సాగు నీరు విడుదల చేయాలని భావించి నిధులు మంజూరు చేసినా పనులు జరగలేదు. ఇప్పుడు మండలంలోని ఆయకట్టుకు సాగర్ నీరు అందించేందుకు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వపై డీప్ కట్

డిజైన్ ఇలా...

సాగర్ ప్రధాన కాల్వ 13వ కిలోమీటర్ వీ.వీ.పాలెం వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తారు. ఆసా రెండు పైపులైన్ల ద్వారా మండలంలోని సుమారు 5వేల పైగా ఆయకట్టుకు నీరు అందించేలా డిజైన్ తయారు చేశారు. పథకాన్ని మండలంలోని వీ.వీ.పాలెం వద్ద ఏర్పాటు చేసి అక్కడ నుంచి పైపులైన్లను మండలంలోని 30 చెరువులకు అనుసంధానిస్తారు. వీ.వీ.పాలెం నుంచి పాపటపల్లి వరకు సుమారు 10 కి.మీ. ఒక లైన్, వీ.వీ.పాలెం నుండి మంచుకొండ వరకు మరో పైపులైన్ ద్వారా మండలం మొత్తం ఆయకట్టుకు నీరు అందించేలా ఎత్తిపోతల పథకం డిజైన్ రూపొందించినట్లు జల వనరుల శాఖ అధికారుల ద్వారా తెలిసింది. పైపులైనే కావడంతో భూసేకరణ సమస్య పెద్దగా ఉండదని, భూమి లోపల పైపులు వేయడానికి రైతులు కూడా సహకరిస్తారని.. తద్వారా పనులు శరవేగంగా పూర్తయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

జాతీయ విద్యాదినోత్సవంలో మంత్రి తుమ్మల



అబుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంఅర్బన్: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంతో పాటు దాన్ని సాధించేందుకు శ్రద్ధగా చదవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం అల్లీపురంలో రోడ్డులోని మైనార్టీ గురుకుల బాలికల-2 పాఠశాల, కాలేజీలో సోమవారం జరిగిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంలో ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుతున్న గురుకులాల్లో మంచి ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40శాతం పెంచామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ శ్రద్ధగా చదవడమే కాక క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని చెప్పారు. తొలుత కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర విత్తన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ నర్సింహారావు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కస్తాల సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ పి.సీతామహలక్ష్మితో పాటు కమర్తపు మురళి, వెంకటేశ్వర్లు, రావూరి సైదబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన బిడ్డకు కొలువుల దాసోహం

- నాలుగు ఉద్యోగాలు సాధించిన సుందర్
- తాజాగా ఎంవీఐ ఉద్యోగానికి ఎంపిక



సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎంవీఐ నియామకపత్రం అందుకుంటున్న సుందర్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని మల్లేపల్లి పంచాయతీ పరిధి గడ్డికుంట తండాకు చెందిన తేజావత్ సుందర్ పట్టుదలతో చదువు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గతేడాది జూలైలో ప్రభుత్వం అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల నియామకానికి పరీక్ష నిర్వహించగా ఎంపికైన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందుకున్నాడు. 2014 బీటెక్ పూర్తి చేసిన సుందర్ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమయ్యాడు. తొలుత 2016లో ఎన్‌పీసీఐఎల్(న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)లో ఉద్యోగం సాధించాడు. అయినా తన ప్రయత్నాలు మానకుండా 2018లో మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌లో అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్‌గా ఎంపికయ్యాడు. రెండు గ్రూప్-1 కేడర్ పోస్టులే అయినా మరింత పట్టుదలతో చదివి సింగరేణిలో ఉద్యోగం సాధించి ప్రస్తుతం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తాజాగా సుందర్ ఎంవీఐ ఉద్యోగం సాధించడం విశేషం.

కుటుంబ నేపథ్యం ఇలా..

రఘునాథపాలెం మండలంలో మారుమూల గ్రామమైన గడ్డికుంట తండాలో నిరుపేద రైతులు తేజావత్ మంగ్యా – లక్ష్మి దంపతులకు నాలుగో సంతానంగా సుందర్ జన్మించాడు. కుటుంబ పరిస్థితులు సహకరించకున్నా తల్లిదండ్రులతో పాటు పనులకు వెళ్తానే చదువు సాగించాడు. ఈక్రమాన సుందర్ ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాడు. ఆయన అన్న అగ్నిమాపక శాఖలో ఉద్యోగం సాధించగా సుందర్‌కు మార్గనిర్దేశం చేశారు. కాగా, 2019లో సుందర్ వివాహం అంబికతో జరగ్గా వీరికి ఇద్దరు సంతానం. కుటుంబ బాధ్యతలను భార్య చూసుకుంటుండడంతో సుందర్ పోటీ పరీక్షలకు సిద్ధమై నాలుగు ఉద్యోగాలు సాధించగా విద్యాధికురాలైన అంబిక ప్రస్తుతం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది.

ఎప్పటికప్పుడు ధాన్యం కాంటాలు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది ఏర్పాట్లు చేయడమే కాక ఎప్పటికప్పుడు కాంటా వేయించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. మండలంలోని చెరువుమాధారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడడమే కాక ధాన్యంలో తేమ శాతం పరీక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం, కాంటాల్లో ఆలస్యం చేస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఎంపీఓ సీ.హెచ్.శివ, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కారేపల్లి మండలం మునగాలకు చెందిన పరికపల్లి లావణ్య కానరాకుండా పోవడంపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భాన్‌ప్రకాష్ తెలిపారు. దీపావళి పండుగకు ఇంటికి వెళ్లిన విద్యార్థి ఆదివారం హాస్టల్‌కు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరింది. అయితే, సాయంత్రం వరకు ఆమె కాలేజీకి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఫలితం లేక విద్యార్థిని తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంజనీరింగ్ విద్యార్థిని...

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యం కాగా, ఆమె తండ్రి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెంకు చెందిన విద్యార్థిని ఖమ్మంలో ఇంజనీరింగ్ చదువుతోంది. ఇంటికి వెళ్లడానికి తండ్రితో ఫోన్ చేయించి అనుమతి తీసుకున్న ఆమె బయటకు వెళ్లినప్పటికీ ఇంటికి చేరలేదు. దీంతో ఆమె తండ్రి అన్నిచోట్ల ఆరా తీసినా ఫలితం లేక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్షేత్రస్థాయికి పత్తి తేమ యంత్రాలు

- ప్రతీ ఏఈఓ వద్ద యంత్రం
- రైతులు పరీక్ష చేయించుకునేందుకు వీలుగా ఏర్పాటు



మిల్లు వద్ద పత్తిలో తేమ పరీక్షిస్తున్న జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం

ఖమ్మంవ్యవసాయం: పత్తి రైతులకు మద్దతు ధర దక్కేలా సీసీఐ ద్వారా జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు చేపడుతున్నారు. అయితే, 8నుంచి 12శాతం వరకే తేమ ఉంటేనే సీసీ కొనుగోళ్లు చేస్తోంది. కానీ తేమ నిర్ధారించే యంత్రాలు రైతుల వద్ద లేక మిల్లులకు రావడం, తేమ ఎక్కువ ఉందని చెప్పడంతో వేచి ఉండడం సర్వసాధారణంగామారింది. ఈ నేపథ్యాన క్లస్టర్ల వారీగా వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ)కు ప్రభుత్వం తేమ యంత్రాలను కేటాయించింది. సీసీఐ నిర్దేశించిన ఐదు వ్యవసాయ మార్కెట్ల పరిధిలో మొత్తం 150 తేమ పరీక్ష యంత్రాలు ఉండగా.. జిల్లాలోని క్లస్టర్ల వారీగా 129 మంది ఏఈఓలకు వీటిని కేటాయిస్తారు.

తేమ పరీక్ష చేయించుకోవాలి..

రైతులు గ్రామాల్లోనే పత్తి తేమ పరీక్ష చేయించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. పత్తిని ఆరబెట్టి 8 నుంచి 12 శాతం తేమ వచ్చినట్లు నిర్ధారించుకున్నాక సీసీఐ ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లులకు తీసుకురావాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం సూచించారు. తద్వారా వేచి ఉండాల్సిన అవసరముండదని చెప్పారు. కాగా, పత్తి రైతులు కొనుగోళ్ల సమాచారం కోసం 88972 81111 వాట్సప్ నంబర్‌ను వినియోగించుకోవాలని తెలిపారు.

70 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

సత్తుపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సత్తుపల్లి మండలం గౌరిగూడెం నుంచి ఆదివారం అర్ధరాత్రి బొలెరో వాహనంలో ఇద్దరు వ్యక్తులు 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టిన వారు బియ్యం, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించడమే కాక బాధ్యులైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని వైరా రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం షార్ట్‌సర్క్యూట్ జరగగా తృటిలో ప్రమాదం తప్పింది. వైద్యుడు కన్సల్టెంట్ గదిలో ఓపీ చూస్తుండగా ఏసీలో నుంచి మంటలు వచ్చాయి. దీంతో ఆస్పత్రి నుంచి అంతా బయటకు పరుగులు తీయడంతో ఆందోళన నెలకొంది. ఈ సమాచారం తెలియడంతో అగ్నిమాపక శాఖాధికారి నాగరాజు ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేయడంతో ఆస్పత్రి సిబ్బంది, రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

అండర్-14 వాలీబాల్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం స్థాయి అండర్-14 వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపికకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన సోమవారం పోటీలు నిర్వహించారు. జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, వాలీబాల్ కోచ్ ఎం.డీ. అక్బర్ అలీతో పాటు బాలరాజు, నాగరాజు, గోపి, సైదేశ్వర్‌రావు, షఫిక్ అహ్మద్, రాజకుమారిలు పాల్గొన్నారు. కాగా, ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లు ఈనెల 16నుంచి మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. అండర్-14 బాలుర జట్టుకు వై.సందీప్, ఎ.నాగచైతన్య, రిషి వర్మ, బి.నవీన్‌రెడ్డి, ఈ.సన్నీ, ఎం.సాయి అక్షయ్‌కుమార్, కె.రాజు, టి.రామ్‌చరణ్, బి.గణేష్, డి.లోకేష్, ఎం.కరుణాకర్, ఎస్.డీ.అర్షద్. బాలికల జట్టుకు హెచ్.భార్గవి, బి.గౌతమి, బి.సాజన్య, పి.మేఘహర్ష, ఎస్.అర్షి యా, టి.జిన్యాశ్రీ, జె.అక్షియా, ఎ.జోయషిక, ఈ.గాయత్రి, ఈ.దీక్షిత్, సీహెచ్.కోమలి, బి.అనుష, అకృతి ఎంపికయ్యారని వెల్లడించారు.

విత్తన ప్రతినిధులతో బాండ్ రాయించుకోవాలి

వైరారూరల్: యాసంగిలో మొక్కజొన్న సాగు చేయాలనుకునే రైతులు విత్తన కంపెనీల ప్రతినిధులతో బాండ్ పేపర్ రాయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య సూచించారు. మండలంలోని తాటిపూడి లో సోమవారం రాత్రి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెంట్లు చెప్పే మాటలు నమ్మకుండా అన్ని వివరాలతోబాండ్ రాయించుకోవాలని, తద్వారా అవాంతరాలు ఎదురైనా నష్టం ఉండదని చెప్పారు. అనంతరం మొక్కజొన్న సాగు మెళకువలతో పాటు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓలు సపవత్ సైదులు, మేడా రాజేష్, అయిలూరి వసంతి పాల్గొన్నారు.

ఆస్పత్రికి మందుల అందజేతపై అధికారుల ఆరా

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి ఆప్ నాయకులు ఆదివారం సుమారు రూ.50 వేల మందులను అందజేశారు. ఈ సమయంలో మందుల కొరత, ప్రభుత్వం తీరును నాయకులు విమర్శించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో సోమవారం అధికారులు ఈ విషయమై ఆరా తీశారు. ఆస్పత్రిలో మందుల కొరత ఉందా, ఉంటే విషయాన్ని జిల్లా అధికారులకు దృష్టికి తీసుకొచ్చారా, లేదా అని అదనపు కలెక్టర్ జిల్లా వైద్యాశాఖ అధికారులను వివరణ అడిగినట్లు తెలిసింది. ఈమేరకు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ గౌడ్‌ను వివరణ కోరగా ఆస్పత్రికి అవసరమైన మందులపై ఇండెంట్ అడిగినట్లు తెలిపారు.

అక్షర చిట్స్ ఎదుట ఖమ్మం బాధితుల ఆందోళన



బాధితులతో మాట్లాడుతున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: హనుమకొండ నక్కలగుట్టలోని అక్షర చిట్స్ ఎదుట ఖమ్మం బ్రాంచ్ బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. ఖమ్మం జిల్లాలోని ఆరు బ్రాంచ్‌ల్లో వీరంతా చిట్టీలు వేయగా సుమారు రూ.2 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఎప్పుడు అడిగినా యాజమాన్యం వాయిదాలు పెడుతుండడంతో విసిగిపోయిన వంద మందికి పైగా బాధితులు నక్కలగుట్టలోని అక్షర కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేరుకుని యాజమాన్యంతో మాట్లాడుకుని తేల్చుకోవాలని నచ్చజెప్పగా వారు శాంతింపజేశారు. అయితే, ఇంత జరిగినా అక్షర యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

టాటా ఏస్ ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెం వద్ద ద్విచక్రవాహనాన్ని టాటా ఏస్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెంకు చెందిన అంగడి ఉపేందర్(24) గోదావరిఖనిలో సింగరేణి తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయన బైక్‌పై స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి వస్తుండగా గొల్లగూడెం వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఉపేందర్ మృతి చెందాడు.

పాముకాటుతో రైతు మృతి



బుచ్చిరాములు (ఫైల్)

కారేపల్లి: వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతును పాముకాటు వేయడంతో మృతి చెందిన ఘటన ఇది. మండలంలోని ఉసిరికాయలపల్లికి గ్రామానికి చెందిన రైతు, మాజీ వార్డుసభ్యులు పొడుగు బుచ్చిరాములు(45) సోమవారం మధ్యాహ్నం తమ వరి పొలంలో పని చేస్తుండగా కాలిపై పాము కాటు వేసింది. దీంతో స్పృహ కోల్పోయిన బుచ్చిరాములును సమీప రైతులు చేను నుంచి బయటకు చేతులపై ఎత్తుకొచ్చి ఆటోలో ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కాసేపటికే మృతి చెందాడు. బుచ్చిరాములకు భార్య హైమావతి, ఇద్దరు పిల్లలు ఉండగా ఆయన మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

పాలేరు మాజీ ఎమ్మెల్యే సతీమణి ముత్తమ్మ..



ముత్తమ్మ (ఫైల్)

నేలకొండపల్లి: పాలేరు మాజీ శాసనసభ్యుడు, దివంగత పొట్టపింజర ఉస్సేనయ్య సతీమణి ముత్తమ్మ(85) సోమవారం మృతి చెందారు. నేలకొండపల్లి మండలం బోదులబండలో ఆమె మృతి చెందగా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వున్నం బ్రహ్మయ్య, నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి తదితరులు కూడా నివాళులర్పించారు. కాగా, ఉస్సేనయ్య కాంగ్రెస్ నుంచి 1978లో ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, 1981లో మరణించడంతో జరిగిన ఉప ఎన్నికల్లో సంభాని చంద్రశేఖర్ గెలిచారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి హేయనీయం



కూసుమంచిలో నిరసన తెలుపుతున్న తహసీల్దార్ కరుణశ్రీ, ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: ఫార్మా కంపెనీ భూ సేకరణ ప్రక్రియలో భాగంగా గ్రామసభకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయడం హేయమైన చర్య అని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంబూరు సునీల్‌రెడ్డి, డి.పుల్లయ్య అన్నారు. దాడిని నిరసిస్తూ సోమవారం జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలతో ఉద్యోగుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. నాయకులు కారుమంచి శ్రీనివాసరావు, బీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.